# అనుమానం

## -కె. సుధాకరరావు




అప్పారావ్ నేను పనిచేసే ఆఫీస్‌లో ప్యూన్. అప్పారావ్ అనడంకన్నా 'అప్పులరావ్' అంటే అతని పట్ల సార్థకంగా వుంటుంది. గోరైతోకలాంటి జీతం అతని ఖర్చులకు చాలదు – అన్నట్లు కన్పించిన ప్రతి వ్యక్తి దగ్గరా పదో, పరకో అప్పు పుట్టించే నైపుణ్యం అతనిలో వుంది. అదివరకే నేనప్పుడప్పుడు ఇచ్చిన అప్పు దాదాపు రెండు మూడు వందల దాకా అయిందివాటిని తీర్చేమాట అటుంచి ఆరోజు పొద్దున్నే నా దగ్గరకు వచ్చాడు.

"సార్! రేపు బాబు పుట్టిన రోజు ఓ రెండువందలు కావాలి! జీతం వచ్చాక మీ డబ్బు పూవుల్లో పెట్టి ఇస్తా" అన్నాడు ధనుర్వాతం వచ్చిన వాడిలా మూడు వంకర్లు తిరుగుతూ.

"అప్పారావ్ నా దగ్గర మాత్రం డబ్బులెప్పుడూ వుంటాయా ఏమిటి? ఇక దయచేయ్" అన్నా కేలుక్యులేటర్‌తో కూడిక చేస్తూ. కాసేపు నుంచుని, ఇక లాభం లేదని తెలిసాక మౌనంగా వెళ్ళిపోయాడు అపారావ్. రోటరీ క్లబ్ మెంబర్‌గా సమాజసేవ చేయడం నా హాబీగా పెట్టుకున్నా. క్లబ్ పని ముగిసేసరికి ఒక్కోసారి రాత్రి పది దాటేది. ఆరోజు పదకొండయింది. ఇంటికి వెళ్ళా. శ్రీమతి విసురుగా, విసుగ్గా తలుపులు తెరిచింది. ప్రతిరోజూ ఇంత ఆలస్యమైతే ఎలా అన్న భావం ఆమె ముఖకవళికల్లో కన్పిస్తోంది. స్కూటర్ వరండాలో

పార్క్ చేసి, ఇంట్లోకి ప్రవేశించా.

"ప్రతిరోజూ ఇంత ఆలస్యమైతే ఇక ఇంటికి రావడం ఎందుకు? ఆ క్లబ్‌లోనే పడుకోవచ్చుగా" అంది శ్రీమతి కంచంలో విసురుగా అన్నంలోకి సాంబారు పోస్తూ.

నేను మౌనంగా భోజనం అయిందనిపించా. బెడ్‌రూంలోకి ప్రవేశించానో లేదో మా శ్రీమతి మల్లిక ఇంటరాగేషన్ మొదలు పెట్టింది.

"ఇంత రాత్రి పూట ఎక్కడికెళ్లివచ్చారు" మళ్లీ అదే ప్రశ్న.

"ఎన్నిసార్లు చెప్పాలి నీకు? రోటరీక్లబ్ మెంబర్‌ని కావడం వల్ల సమాజసేవా కార్యక్రమాల్లో పాల్గొన్నా. అది కూడా తప్పేనా?" అన్నా బెడ్‌పై కూచుంటూ.

"సమాజసేవ చేస్తున్నారా? లేక సానిసేవ చేస్తున్నారా?" ఈసారి మరింత కటువుగా అడిగింది శ్రీమతి.

"మల్లీ! నువ్వేం మాట్లాడుతున్నావో నీకు తెలిసిందా?"

"ఆ తెలుసు! ఇంతసేపూ ఏ సానికొంపలో వున్నారూ అని అడుగుతున్నా"

"చూడు మల్లీ! ముందే చెప్పానుగా! క్లబ్ మెంబర్లమంతా కలిసి సమాజసేవ చేసే కార్యక్రమం చేపట్టామని! ఈ కార్యక్రమం ఓ మూడు నెలల పాటు సాగుతుంది. కాస్త ఆలస్యమైతే ఆ మాత్రానికే ఇంత గొడవ చేస్తావా?"

"గొడవ కాదండీ! గోడు! ఇంట్లో ఇల్లాలు ఒంటరిగా, దిగులుగా వేచి వుంటుందన్న జ్ఞానం లేదూ? మీరెక్కడ తిరిగివచ్చారో నాకు తెలుసు. అది తెలిసినప్పటి నుంచి నా సంసారం ఎక్కడ కూలిపోతుందోనని బాధ" అంది చీరచెంగుతో కళ్ళు తుడుచుకుంటూ.

"మల్లీ! ప్లీజ్! నీవేం మాట్లాడుతున్నావో నాకు ఏమీ అర్థం కావడంలేదు" అన్నా.

"మీకెలా తెలుస్తుంది. అన్నీ చేసి కూడా ఏమీ తెలీని నంగనాచిలా నటిస్తున్నారు"

"మల్లికా" గర్జించాను క్రోధారుణ నేత్రాలతో ఆమెవైపు చూస్తూ. కోపంతో వణికిపోతూనే అడిగా -

"చెప్పు! నీకు తెలిసిందన్నావుగా! నేనెక్కడికి వెళ్ళానో"

"సిటీలో ప్రతిరోజూ మీరు రెడ్ లైట్ ఏరియాకు వెళుతున్నారు కదూ"

నేను ఆశ్చర్యపోయా. ఈమెకీ విషయం ఎలా తెలిసింది అన్న విషయం అర్థమే కావడంలేదు.

"నేను సమాజసేవకోసం వెళుతున్నా"

"సానికొంపలో ఏం సమాజసేవ చేస్తారో ఊహించలేనంతటి వెర్రిదాన్ని కాదు నేను."

ఇక వాదించి లాభంలేదు. మౌనంగా నిద్రకుపక్రమించా. రాత్రంతా నిద్రపోలేదు. మల్లి! వేరే గదిలో పడుకుంది.

తెల్లవారాక పదిగంటలకు వారం రోజులదాకా రానని చెప్పి మరీ వెళ్ళింది సిటీలో వున్న పుట్టింటికి. ఆమె అటువెళ్ళడం, ఒక స్కూటర్ రావడం ఒకేసారి జరిగాయి. గేటువైపు చూశా. ఆఫీసులో నా కొలీగ్ శేఖర్ వచ్చాడు.

"ఏంటి! ఇవాళ ఆఫీసుకు సెలవా" అడిగాడు శేఖర్.

"లేదురా! ఒంట్లో బాగాలేక వుండిపోయా. బాస్‌కు ఫోన్‌చేశాలే" అన్నా.

"వదినగారు లేరా" శేఖర్ అడిగాడు - కుర్చీలో కూచుంటూ.




నేను కాఫీ తెద్దామని లేస్తే శేఖర్ వారించాడు.

"ఆమె పుట్టింటికి వెళ్ళింది. ఓ వారం రోజులు క్యాజువల్ లీవ్ పెట్టింది" అన్నా. శేఖర్ నా జోక్‌కి నవ్వాడు.

"మొన్న అప్పారావ్ వంద ఇమ్మన్నాడు"

"ఇచ్చావా?" అడిగాను ఆశ్చర్యంగా.

"వాళ్ళావిడకేదో జబ్బట! అందుకే ఇచ్చేశా. అయితే నువ్వు వాడికి డబ్బులడిగితే ఇవ్వలేదట!"

"వాడి పాత బేలెన్సు బోలెడుంది. మళ్ళీ అనవసరంగా డబ్బులు వాడి ముఖాన పడేయడం దేనికని ఇవ్వలే"

"కొంప మునిగింది. వాడు మల్లిక వదినగారి దగ్గరకు వచ్చాడట"

"ఏం డబ్బులడగడానికా?"

"కాదు. నువ్వు రోజూ రెడ్‌లైట్ ఏరియాలో తిరుగుతున్నావని చెప్పడానికి."

"శేఖర్! రోటరీ క్లబ్ మెంబర్స్ అంతా కలిసి ఎయిడ్స్ రోగం గురించి వేశ్యలకు వివరించే కార్యక్రమం చేపట్టాం. తమ దగ్గరకు వచ్చే మగ కస్టమర్లకు తప్పనిసరిగా కండోం వాడమని చెప్పాలి. ఈ విషయాన్ని వివరిస్తూ ఉచితంగా వేశ్యలకు కండోమ్స్ సరఫరా చేస్తున్నాం. ఇది మేం చేస్తున్న సమాజసేవ" వివరించాను.

"మైగాడ్! ఇదా నువ్వు చేసే పని. సారీ! నేను ఆ అప్పారావు గాడి మాటలు నిజమని నమ్మా! వాడి సంగతి రేపు ఆఫీసులో చూద్దాం. ముందు మల్లిక వదినగారికి ఈ రహస్యం చెప్పివస్తా" అంటూ స్కూటర్‌పై బయలుదేరాడు శేఖర్.

మౌనంగా మందహాసం చేస్తూ నింగికేసి చూస్తూ నిల్చున్నా. అనుమానాల్లాంటి మేఘాలు మాయమైన అంతరంగంలా ఆకాశం నిర్మలంగా తోచింది.

## మీకు తెలుసా?

* ఆంగ్ల పుస్తకాల ప్రచురణలో మనదేశం ప్రపంచంలో మూడవ స్థానాన్ని ఆక్రమిస్తుంది.
* వేరుశనగల ఉత్పత్తిలో ప్రపంచంలో భారత్, చైనాలు అగ్రస్థానాన్ని ఆక్రమిస్తున్నాయి.
* పదిహేను మిలియన్లకు పైగా జనాభాను కలిగిన నగరాలను హైపర్ సిటీస్ అంటారు.
* మాంచెస్టర్ ఆఫ్ ది ఓరియంట్ అని ఒసాకా నగరాన్ని పిలుస్తారు.

- భో.శ్రీ.